

మా కలం.. మీ వజ్రాయుధం..

APTEL 2022 / 16169

# టుడే పల్లె సాక్షి

తెలుగు దిన పత్రిక

pallesakshi2022@gmail.com youtub : pallesakshi news

PUBLISHED FROM : AMARAVATHI, VIJAYAWADA, HYD, KURNOOL, NANDYALA, KADAPA, ANANTAPUR, CHITOOR, ALL DISTRICTS IN ANDHRA PRADESH & TELANGANA

| కర్నూలు : ఎడిటర్ : వి.లింగమూర్తి | సంపుటి : 5 సంచిక : 90 | పేజీలు : 8 | వెల రూ.4/- | email : pallesakshi2022@gmail.com | గురువారం 27-08-2026 |
|---|---|---|---|---|---|







# కోదాడ వద్ద బస్సు ప్రమాదం..

# పెను..'విషాదం'..!!




## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

## ఆరుగురి మృతి



**కోదాడ వద్ద రక్తసిక్తమైన రహదారి..**

**ఆరుగురిని మింగేసిన అతివేగం.. 12 మందికి సీరియస్..!**

- క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు
- ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని డీకొన్న బస్సు...
- డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు
- ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున పరారయ్యాడు
- రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు..
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు
- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,
- మంత్రి నారా లోకేశ్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం
- ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలి

**కోదాడ** : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్ర బాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి డీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9 గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారు జామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు.

**సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి..** కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి

..2వ పేజీలో




## నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో

## మాట్లాడిన ప్రధాని మోదీ

**మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం**

**అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా**

**ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు అండగా భారత ప్రజలు**

భారత ప్రధాని నరేంద్ర మోదీ.. నేపాల్ ప్రధాని బాలెన్ షాతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. మెరుపు వరదల కారణంగా జనం ప్రాణాలు కోల్పోవటంపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. వరద పరిస్థితులపై ఆరా తీశారు. అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని మోదీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో బుధవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ప్రధాన మంత్రి బాలేంద్ర షాతో మాట్లాడాను. నేపాల్‌లో సంభవించిన వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేశాను. ఈ కష్టసమయంలో నేపాల్‌లోని సోదర సోదరీమణులకు భారతదేశ ప్రజలు అండగా ఉంటారు. నేపాల్‌కు సాధ్యమైనంత వరకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. సహాయక, రక్షణ చర్యలపై మా బృందాలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు.

**105 మంది భారతీయుల గల్లంతు..** ఉద్ధృతంగా ప్రవహించిన భోటేకోశీ నది నువాకోట్, ధాడింగ్ జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. టిబెట్ వైపు నుంచి వచ్చిన మెరుపు వరదల కారణంగా పలు ఊళ్లు, బ్రిడ్జ్‌లు, ప్రాజెక్ట్‌లు నీటిలో కొట్టుకుపోయాయి. వరద బీభత్సం

..2వ పేజీలో



## సముద్రంలో గల్లంతైన ఏడుగురు కోనసీమ

## మత్స్యకారులు క్షేమం..!!

- సముద్రంలో గల్లంతైన కోనసీమకు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యం
- బెంగాల్-ఒడిశా బోర్డర్‌లో మత్స్యకారుల ఆచూకీని మరో బోటు సిబ్బంది గుర్తించారు
- ఏడుగురు మత్స్యకారులను గుర్తించిన మరో బోటు సిబ్బంది..
- ఇంజిన్ పనిచేయని బోటును మరో బోటుకు కట్టి ఒడ్డుకు తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది
- మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం: మంత్రి అచ్చెన్న

..2వ పేజీలో

**కోనసీమ** : సముద్రంలో గల్లంతైన కోనసీమకు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యమైంది. బెంగాల్-ఒడిశా బోర్డర్‌లో మత్స్యకారుల ఆచూకీని మరో బోటు సిబ్బంది గుర్తించారు. గల్లంతైన మత్స్యకారులంతా క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు 3న కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి IND-AP-E8-MO-135 'ముత్యాలమ్మ' బోటులో ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. అనంతరం వారు గల్లంతయ్యారు. అప్పటి నుంచి వారి ఆచూకీ కోసం అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. తాజాగా పశ్చిమబెంగాల్‌లోని దిగా ప్రాంతం వద్ద మరో బోటు సిబ్బంది.. గల్లంతైన బోటును గుర్తించారు. అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఇంజిన్ చెడిపోవడం వల్లే



## దేశ యువతకు ప్రధాని మోదీ..

## కీలక సందేశం..!!

**ఖేలో ఇండియా డైలాగ్‌లో దిశానిర్దేశం..!**

- దేశవ్యాప్తంగా 1,500కు పైగా విద్యా సంస్థల్లో ఏకకాలంలో ఈ కార్యక్రమం
- ప్రతి జిల్లాలోని రెండు కళాశాలల్లో యువ సంవాద్ నిర్వహిస్తారు
- యువ క్రీడాకారుల అనుభవాలు, అభిప్రాయాలు తెలుసుకోవడం ప్రధాన లక్ష్యం
- క్రీడల ద్వారా యువతను మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉంచాలి
- యువత ఆకాంక్షలు జాతీయ క్రీడా విధానంలో భాగం కావాలి
- ఫిట్, క్రమశిక్షణతో కూడిన క్రీడా దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలి
- వికసిత్ భారత్ నిర్మాణానికి ఈ ఖేలో ఇండియా డైలాగ్ ఒక ముఖ్యమైన వేదిక

2లో

జాతీయ క్రీడా దినోత్సవం-2026 సందర్భంగా దేశ యువతతో మాట్లాడనున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. గురువారం (ఆగస్టు 27) ఖేలో ఇండియా డైలాగ్-ఖేల్ కీ బాత్ ప్రధాని మోదీ కే సాథ్ కార్యక్రమంలో యువతతో వర్చువల్‌గా మాట్లాడనున్నారు. దేశవ్యాప్తంగా 1,500కు పైగా విద్యా సంస్థల్లో

# శ్రావణమాసంలో కూడా ఆగని...

# ఇసుక దందా...!!

**ఇసుక మాయాజాలం వల్ల గ్రామంలో ట్రాఫిక్ సమస్యగా మారుతున్న ఇసుక టిప్పర్ లారీలు ..**

**లారీ టిప్పర్ ల నుండి ఎప్పుడు ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు ఆవేదన..**





**కౌతాళం : 26 : ఆగస్టు : ( టుడే పల్లె సాక్షి )** కౌతాళం మండలంలో అక్రమ ఇసుక మాఫియా





రోజురోజుకు చెలరేగిపోతున్నాయి శ్రావణమాసం సందర్భంగా ఉరుకుంద వీరన్న స్వామి దర్శనం నిమిత్తం నెల రోజులు పాటు తిరిగి ఈ ఉత్సవానికి అన్ని రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారి మొక్కుబడులు తీర్చుకోవడానికి వస్తుంటారు. ఇలాంటి సమయంలో ట్రాఫిక్ లో తీవ్ర సమస్య ఏర్పడుతుంది. వాటిని క్లియర్ చేసే పనిలో పోలీస్ సిబ్బంది ఉంటే ఇసుక మాఫియా మాత్రం విచ్చలవిడిగా టిప్పర్లలో రాష్ట్రాలు దాటిస్తున్నాయి. ఈ టిప్పర్లు ఇసుక తోలడం వల్ల రోడ్లు మొత్తం దెబ్బతిని ఇటీవల ఒక ట్రాక్టర్ ఒక ఎరువుల లారీ రోడ్డుపైనే చిక్కుకొని చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇసుక టిప్పర్ ముందు వెళ్తుంటే ఓవర్ లోడ్ ఇసుక నింపడంతో వెనక ప్రయాణిస్తున్నటువంటి వాహనదారుల కళ్ళల్లో పడి చాలా ఇబ్బందికరంగా మారుతుంది. దయచేసి సంబంధిత అధికారులు ఇసుక టిప్పర్లను తోలనివ్వకుండా అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. నదులు, వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్న ఇసుక మాఫియా విచ్చలవిడిగా రెచ్చిపోతోంది. వర్షాలు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో అత్యధిక ఇసుకను తోలడం వల్ల నదీ పరీవాహక ప్రాంతాలు, వాగులు దెబ్బతింటున్నాయి, భూగర్భ జలాలు తగ్గి తాగునీటికి ముప్పు ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు...

పల్లె సాక్షి



# దేశ యువతకు ప్రధాని మోదీ కీలక సందేశం..!!

**(మొదటిపేజి తరువాయి)** ఏకకాలంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి జిల్లాలోని రెండు కళాశాలల్లో యువ సంవాద్ నిర్వహిస్తారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్, ప్రముఖ వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలు సహా అనేక సంస్థలు పాల్గొంటున్నాయి. ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశ యువతను ఉద్దేశించి ప్రసంగిస్తారు. క్రీడలు, యువత సాధికారత, ఫిట్‌నెస్, యువ నాయకత్వం, వికసిత్ భారత్ నిర్మాణం అంశాలపై ప్రధాని యువతతో ముఖాముఖి మాట్లాడనున్నారు. యువ క్రీడాకారుల అనుభవాలు, అభిప్రాయాలు తెలుసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. క్రీడా మౌలిక వసతులు, కోచింగ్, స్పోర్ట్స్ సైన్స్, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రతిభావంతుల గుర్తింపు, క్రీడాకారుల శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది కేంద్రం. యువ నాయకత్వం, స్వచ్ఛంద సేవలు, భవిష్యత్ నైపుణ్యాలు, పౌర బాధ్యత వంటి అంశాలపై కూడా చర్చ జరుగుతుంది. ప్రముఖ భారత క్రీడాకారులు, పతక విజేతలు, దేశ యువతతో ప్రధాని మోదీ ప్రత్యక్షంగా మాట్లాడతారు. మేరీ కామ్, సైనా నెహ్వాల్, పి.టి. ఉషా, దీపా కర్మాకర్, గగన్ నారంగ్, శ్రీజేష్, బైచుంగ్ భూటియా, పుల్లెల గోపీచంద్, అంజు బాబీ జార్జ్, కరణం మల్లేశ్వరి, మీరాబాయి చాను తదితరులు పాల్గొంటారు. యువత సూచనలు MY Bharat పోర్టల్ ద్వారా సేకరించి విధాన రూపకల్పనలో ఉపయోగిస్తారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్‌లో పాల్గొనాలని, MY Bharatలో నమోదు కావాలని యువతను ప్రోత్సహిస్తారు.

**నషా ముక్త్ యువ...** నషా ముక్త్ యువ ఉద్యమంపై యువతతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా మాట్లాడనున్నారు. క్రీడల ద్వారా యువతను మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. యువత ఆకాంక్షలు జాతీయ క్రీడా విధానంలో భాగం కావాలని, ఫిట్, క్రమశిక్షణతో కూడిన క్రీడా దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇవ్వనున్నారు. యువత ఆధ్వర్యంలో వికసిత్ భారత్ నిర్మాణానికి ఈ ఖేలో ఇండియా డైలాగ్ ఒక ముఖ్యమైన వేదికగా నిలవనుంది.

# 'విషాదం'..!!

**(మొదటిపేజి తరువాయి)** మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

## సముద్రంలో గల్లంతైన ఏడుగురు కోనసీమ

# మత్స్యకారులు క్షేమం..!!

**(మొదటిపేజి తరువాయి)** మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటు కొంతకాలంగా కదలలేని పరిస్థితిలో సముద్రంలోనే ఉండిపోయినట్లు తెలుస్తోంది. ఏడుగురు మత్స్యకారులను



గుర్తించిన మరో బోటు సిబ్బంది.. ఇంజిన్ పనిచేయని బోటును మరో బోటుకు కట్టి ఒడ్డుకు తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు 23 రోజుల తర్వాత మత్స్యకారులు క్షేమంగా ఉన్నారనే సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం: మంత్రి అచ్చెన్న**

సముద్రంలో గల్లంతైన ఏడుగురు కోనసీమ మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందన్నారు. జిల్లా కలెక్టర్, కమిషనర్, మత్స్యశాఖ జేడీ, ఎఫ్‌డీవోలకు మంత్రి అభినందనలు తెలియజేశారు. మత్స్యకారులను స్వస్థలానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, పశ్చిమ బెంగాల్ వెళ్లాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## నేపాల్ ప్రధాని బాలెన్ షాతో ఫోన్‌లో

# మాట్లాడిన ప్రధాని మోదీ

**(మొదటిపేజి తరువాయి)** కారణంగా బుధవారం ఉదయం రసువా జిల్లాలో 1000 మంది నీటిలో కొట్టుకుపోయారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది.

# నేపాల్‌లో ఆకస్మిక వరదలు..

## అసలు ఏం జరిగింది?

నేపాల్‌లో నేడు ఉదయం అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరదలు అనేక మందిని పొట్టనపెట్టుకున్నాయి. 105 మంది భారతీయులు కూడా ఈ విపత్తులో గల్లంతయ్యారు. చైనాతో సరిహద్దుకు సమీపంలోని రసువా జిల్లాలోని భోటే కోశీ నదిలో ఒక్కసారిగా వరద




పొట్టెత్తడంతో తీరంలోని అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో నేపాల్‌కు దిగువన ఉన్న బిహార్, యూపీ రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మరోవైపు, ఈ అకస్మిక వరదలకు కారణం ఏంటో తెలుసుకునేందుకు నేపాల్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు.

**నిత్యం ముప్పు అంచున నేపాల్..** ఆకస్మిక వరదలు కేవలం గంటల వ్యవధిలోనే విరుచుకుపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఒక్కసారిగా భారీ స్థాయిలో కుండపోత వర్షం కురిసినా, లేదా నదీప్రవాహానికి అడ్డుగా ఉండే కొండచరియలు విరిగి పడిన సందర్భాల్లో కూడా ఆకస్మిక వరదుల దిగువన ఉన్న ప్రాంతాలను ముంచెత్తుతాయి. కొండల్లోని మంచు కరగడంతో ఏర్పడే గ్లేషియల్ సరస్సులు అస్థిరమై ఒక్కసారిగా కిందకు దూసుకొచ్చిన సందర్భాల్లో కూడా లోతట్టు ప్రాంతాలను ఆకస్మిక వరదలు ముంచెత్తుతాయి. అంతెత్తున ఉండే కొండల నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నీటి ప్రవాహానికి తన దారిలో ఉన్న అన్ని నిర్మాణాలను నేలమట్టం చేయగల శక్తి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, రసువా జిల్లాలో నేడు వర్షాలకు అవకాశం తక్కువని అక్కడి వాతావరణ శాఖ ముందే అంచనా వేసింది. కానీ నేపాల్‌కు ఎగువన ఉన్న టిబెట్‌లో భారీ వర్షం కురిసిన విషయం శాటిలైట్ చిత్రాల్లో బయటపడ్డట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయమై తమను ముందస్తుగా హెచ్చరించడంలో చైనా విఫలమైందని ఇప్పటికే నేపాల్ జర్నలిస్టు ఒకరు నెట్టింట తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాలయాల్లో ఉన్న నేపాల్‌లో భారీ పర్వతాలు, వాటి నుంచి కిందకు వేగంగా దూసుకొచ్చే నదులతో ఎల్లప్పుడూ ముప్పు పొంచి ఉంటుంది. ముఖ్యంగా వానాకాలంలో కురిసే వర్షాల కారణంగా కొండ కోనల్లో పోటెత్తే వరదలు చూస్తుండగానే మహోగ్రరూపం దాలుస్తాయి. ఇది చాలదన్నట్టు వాతావరణ మార్పులు పరిస్థితులను మరింత జటిలం చేస్తున్నాయి. భూతాపం పెరుగుతుండటంతో నేపాల్‌లోని కొండలపై మంచు కరిగిపోతోంది. హిమనదాలు కనుమరుగు అవుతున్నాయి. ఫలితంగా కొండలపై భారీ గ్లేషియల్ సరస్సులు ఏర్పడుతున్నాయి. కొండప్రాంతాలు సహజంగా అస్థిరంగా ఉంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో కొండచరియుల విరిగిపడ్డా లేక కాస్త ఎక్కువ వర్షం కురిసినా సరస్సులు కట్టలు తెంచుకుని దిగువనున్న ప్రాంతాలను ముంచెత్తే అవకావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# సంపాదకీయం

# వాహనదారులకు బిగ్ అలర్ట్..!

## ట్రాఫిక్ చలాన్ల వసూలుకు పోలీసుల సంచలన ప్లాన్..!

హైదరాబాద్‌లో వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు కొత్త షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే విధించే ఈ-చలాన్ల మొత్తాన్ని ఇకపై




**నేరుగా వాహనదారుల ఫాస్టాగ్ ఖాతా నుంచే ఆటోమేటిక్‌గా కట్ చేసే విధానాన్ని తీసుకురావాలని పోలీసులు ప్రతిపాదిస్తున్నారు. సాంకేతికతను ఉపయోగించి చలాన్ల వసూళ్లను మరింత వేగవంతం చేయడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను తగ్గించడమే ఈ ప్రతిపాదన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.**

హైదరాబాద్‌లో వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు కొత్త షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే విధించే ఈ-చలాన్ల మొత్తాన్ని ఇకపై నేరుగా వాహనదారుల ఫాస్టాగ్ ఖాతా నుంచే ఆటోమేటిక్‌గా కట్ చేసే విధానాన్ని తీసుకురావాలని పోలీసులు ప్రతిపాదిస్తున్నారు. సాంకేతికతను ఉపయోగించి చలాన్ల వసూళ్లను మరింత వేగవంతం చేయడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను తగ్గించడమే ఈ ప్రతిపాదన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు. సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. ఈ విధానం అమలుపై హెచ్ఎండీఏ అధికారులతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సంబంధిత అనుమతులు, సాంకేతిక అంశాలు పూర్తయిన తర్వాత ఈ వ్యవస్థను అమల్లోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలను కెమెరాలు, ఇతర సాంకేతిక వ్యవస్థల ద్వారా గుర్తించి ఈ-చలాన్లు జారీ చేస్తున్నారు. అయితే చాలామంది వాహనదారులు జరిమానాలను వెంటనే చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచుతున్నారని పోలీసులు చెబుతున్నారు. దీంతో బకాయి చలాన్ల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఫాస్టాగ్‌తో అనుసంధానం చేస్తే జరిమానా విధించిన వెంటనే నిర్దేశిత మొత్తాన్ని వసూలు చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ ప్రతిపాదన కేవలం చలాన్ల వసూళ్లకే పరిమితం కాకుండా నగర ట్రాఫిక్ నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచే దిశగా అడుగుగా అధికారులు భావిస్తున్నారు. పెరుగుతున్న వాహనాల సంఖ్య, రద్దీ, పార్కింగ్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సమగ్ర ప్రణాళిక అవసరమని చెబుతున్నారు. ప్రజా రవాణాను బలోపేతం చేయడం, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రధాన ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు కూడా అవసరమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రోడ్లపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించడంతో పాటు సొంత వాహనాల వినియోగాన్ని తగ్గించేలా ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఫాస్టాగ్ నుంచి చలాన్ల ఆటోమేటిక్ వసూలు విధానం అమల్లోకి వస్తే.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై ఆర్థికంగా తక్షణ ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే ఈ విధానం ఎప్పుడు అమల్లోకి వస్తుంది? ఏ నిబంధనల ప్రకారం చలాన్లు కట్ చేస్తారు? వాహనదారులకు ముందస్తు సమాచారం ఎలా ఇస్తారు? వంటి అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' షురూ..

## 4 భారత కంపెనీలపై అమెరికా ఆంక్షలు..!

ఇరాన్‌పై అమెరికా ఆంక్షల ఒత్తిడి మరింత తీవ్రతరమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్'లో భాగంగా భారతదేశానికి చెందిన నాలుగు కంపెనీలపై ఆంక్షలు విధించింది. సుమారు 119 మిలియన్ డాలర్ల



విలువైన ఇరాన్ చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తుల వాణిజ్యంలో పాల్గొన్నారనే ఆరోపణలతో ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ట్రెజరీ శాఖ వెల్లడించింది. అంతేకాదు ముగ్గురు భారతీయులపైనా వ్యక్తిగతంగా ఆంక్షలు విధించింది. సదాశివ ఓవర్సీస్ లిమిటెడ్ 2024 ఫిబ్రవరి నుంచి 2025 జూన్ మధ్య సుమారు 69 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ ముడి పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. ఈ రవాణాల్లో గతంలో అమెరికా ఆంక్షలు విధించిన బొంజోర్ కమోడిటీ ఫ్జీజుతో సంబంధాలున్నట్లు ఆరోపించింది. అలాగే పీపీ సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రకృతిస్ ఇన్‌ఫ్రా ఇంపెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు చెరో 25 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నాయని అమెరికా ట్రెజరీ పేర్కొంది. ఇరాన్ పెట్రోకెమికల్ ఉత్పత్తుల రవాణాకు సహకరించిందనే ఆరోపణలతో భారత కస్టమ్స్ బ్రోకర్ సంస్థ పోర్టీజ్ పార్ట్‌నర్స్ ఎల్ఎల్‌పీపైనా ఆంక్షలు విధించారు. పీపీ సాఫ్ట్‌టెక్ డైరెక్టర్ ప్రశాంత్ గార్గ్‌తో పాటు పోర్టీజ్ భాగస్వాములు ఇంద్రిస్మియా అఫ్షమియా షేక్, హరీష్ రామచంద్ర రంగిలను కూడా అమెరికా లక్ష్యంగా చేసుకుంది. తాజా చర్యలను అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ 'ఆర్థిక డి-డే'గా అభివర్ణించారు. ఇరాన్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి ఏకాకిని చేయడమే తమ లక్ష్యమని, టెహ్రాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగించే సంస్థలు, వ్యక్తులు జరిమానాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. అయితే అమెరికా చర్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇవి అంతర్జాతీయ చట్టానికి, ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు విరుద్ధమని పేర్కొంది. ఆంక్షలను ఎదుర్కొనేందుకు తమ దేశం పూర్తిగా సిద్ధంగా ఉందని ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదానిజాదే తెలిపారు. తమకు రెండేళ్ల ప్రణాళిక ఉందని వెల్లడించారు. మరోవైపు, అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల్లో ఆర్థిక ఒత్తిడి పెరగడం చమురు మార్కెట్లలో కొంత భయాన్ని తగ్గించినప్పటికీ, హోర్ముజ్ జలసంధిలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తమైతే చమురు ధరలు వేగంగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఇరాన్‌తో వాణిజ్యం చేస్తున్న దేశాలు, ముఖ్యంగా భారతీయ సంస్థలు, అమెరికా ఆంక్షల ప్రభావంపై అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

# చక్కెర ధరలపై కేంద్రం గుడ్‌న్యూస్.. త్వరలో తగ్గే ఛాన్స్!

**దేశంలో చక్కెర ధరల పెరుగుదలపై జరుగుతున్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. చెరుకు ఉత్పత్తిని ఇథనాల్ తయారికి మళ్లించడంతోనే చక్కెర కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయన్న ప్రచారంతో ఎలాంటి వాస్తవం లేదని క్లారిటీ ఇచ్చింది. ఇది పండుగ సీజన్ నేపథ్యంలో సాధారణంగా కనిపించే పెరుగుదలేనని స్పష్టం చేసింది. వాస్తవంగా చెప్పాలంటే 2023తో పోల్చుకుంటే ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించిన చక్కెర వాటా 2025--26 నాటికి సుమారు 9 శాతానికి తగ్గినట్టు తెలిపింది.**



దేశంలో చక్కెర ధరల పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఇవి పండుగ సీజన్‌లో ఉండే సాధారణ పెరుగుదలేనని స్పష్టం చేసింది ప్రపంచంలో రెండో అతిపెద్ద చెరకు ఉత్పత్తిదారుగా ఉన్న భారతదేశంలో చక్కెర పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదక శక్తిగా మారిందని.. దేశంలో దాదాపు 5 కోట్ల మంది రైతులు, 5 లక్షల మంది మిల్లు కార్మికులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొంది. గతంలో పోల్చుకుంటే 2025-26లో చెరకు ఉత్పత్తి 500 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరిందని.. గత దశాబ్దంలో ఇది సుమారు 43.5శాతం వృద్ధిని క్రియేట్ చేసినట్టు తెలిపింది. 2026-27 సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ చెరకుకు కనీస మద్దతు ధరను రూ.365గా నిర్ణయించిందని.. మన దేశంలో ఉత్పత్తి అయిన చక్కెరను విదేశాలకు ఎగుమతి చేస్తున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలు అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. అలాగే 2025-26లో మన దేశం నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెర శ్రీలంక, పశ్చిమాసియా, తూర్పు ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అయిందని తెలిపారు.

**ఇథనాల్ బ్లెండింగ్‌తో రైతులకు ఆర్థిక భరోసా**

అయితే పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం ద్వారా ఇంధన భద్రత పెరగడమే కాకుండా చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగైందని కేంద్ర స్పష్టం చేసింది. 2025-26 సీజన్‌కు సంబంధించి ఆగస్టు 2026 నాటికి రైతులకు అందాల్సిన బకాయిల్లో 97 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని పేర్కొంది. అలాగే గతంలో పోల్చుకుంటే ఇథనాల్ తయారీలో చెరుకు వాడకం చాలా వరకు తగ్గిందని.. ప్రస్తుతం చక్కెర తయారీ వాటా 9శాతానికి చేసందని తెలిపింది. సుమారు 75 శాతం ఇథనాల్‌ను మొక్కజొన్న తదితర ధాన్యాల నుంచే ఉత్పత్తి చేస్తున్నట్టు స్పష్టం చేసింది. కాబట్టి దేశంలో చక్కెర వినియోగానికి ఎటువంటి కొరత లేదని.. ఏర్పడదని చెప్పుకొచ్చింది.

**ధరల పెరుగుదల తాత్కాలికమే...** గత నెల రోజుల్లో దేశీయ మార్కెట్‌లో కిలో చక్కెర ధర రూ.48.18 నుండి రూ. 55.70కి పెరిగింది. పండుగల సీజన్ డిమాండ్, అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల ఉత్పత్తి 306 లక్షల మెట్రిక్ టన్నులకు పరిమితం కావడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ఏర్పడిన లోటు వ్యాపారుల నిల్వల కారణంగా ఈ ధరలు పెరిగాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉత్పత్తి అంచనాల కంటే కాస్త తగ్గినప్పటికీ.. దేశీయ అవసరాలకు సరిపడా చక్కెర నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. అంతేకాదు అక్టోబర్ నుంచి కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ధరలు కూడా అదుపులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపింది.

**చక్కెర నిల్వలు, ధరల నియంత్రణపై చర్యలు...** దేశంలో తాత్కాలికంగా పెరిగిన చక్కెర ధరలను అదుపు చేయడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దేశంలో అక్రమ నిల్వలను అరికట్టడానికి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న చక్కెర డీలర్లపై ఆగస్టు 1, 2026 నుండి నవంబర్ 30, 2026 వరకు 400 టన్నుల గరిష్ట నిల్వ పరిమితిని విధించారు. అలాగే సెప్టెంబర్ 1, 2026 నుండి భారీ పరిమాణంలో చక్కెరను వినియోగించే సంస్థలు తమ 15 రోజుల వినియోగానికి మించి అదనపు నిల్వలు ఉంచుకోవద్దని స్పష్టం చేశారు. కృత్రిమ కొరత, అక్రమ నిల్వలను అరికట్టేందుకు మిల్లుల్లో అధికారులు నిరంతర తనిఖీలు చేస్తున్నారు. అంతేకాదు పండుగల సీజన్‌లో కొరత లేకుండా చూసేందుకు అక్టోబర్ 15, 2026 నుంచే క్రషింగ్ ప్రారంభించాలని రాష్ట్రాలు, మిల్లులను ఆదేశించారు. దీనివల్ల సాధారణంగా అక్టోబర్‌లో వచ్చే 3-4 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి ఏకంగా 10 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుత ధరల పెరుగుదల అనేది ఉత్పత్తి తగ్గుదల, పండుగల డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల వల్ల ఏర్పడిన తాత్కాలిక పరిణామం మాత్రమేనని తెలిపింది.

APTEL 2022 / 16169
టుడే పల్లె సాక్షి
కర్నూలు నంద్యాల

# శాంతితో ఈద్-మిలాద్-ఉన్-నబీ వేడుకలు

**"ఈద్ మిలాద్ ఉన్ నబి " అంటే "మహమ్మద్ ప్రవక్త" జన్మదినం...**

**ఈద్ - మిలాద్ - ఉన్ - నబీ పండుగ సందర్భంగా నూతన ముస్లిం కమ్యూనిటీ హాలో వైసీపీ నాయకులు ఘనంగా సన్మానం**

**ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వైసీపీ నాయకులు ఆర్.రామలింగారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, తాలూకా బూత్ కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి**

**పెద్దకడుబూరు ఆగష్టు 26 (పల్లెసాక్షి):** పెద్దకడబూరు మండలంలో ఈద్ – మిలాద్ – ఉన్ – నబీ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం





ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ వేడుక అనంతరం ముస్లిం సోదరులు, చిన్నారులు మదీనా మసీద్ మరియు జామియా మసీద్ ఆవరణంలో పెద్ద సంఖ్యలో పాల్గొని మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను స్మరించుకున్నారు. మక్కా మదీనా చిత్రాలతో అల్లా ,మహమ్మద్ ప్రవక్త పేరు కలిగిన జెండాలు చేతబట్టి గ్రామ పురవిధుల గుండా ర్యాలీ నిర్వహించి మహమ్మద్ ప్రవక్త నినాదాలతో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం ముస్లిం కమ్యూనిటీ హాలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా హాజరైన వైసిపి మండల నాయకులకు శాలువా పూలమాలలతో ముస్లిం మత పెద్దలు ఘనంగా సత్కరించడం జరిగిందని ముస్లిం సోదరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మూర్తి స్వామి, ఇంద్రసేనారెడ్డి, జాము రాముడు ముస్లిం సోదరులు హుసేని,బడే సాబ్,అజీజ్, హుస్సేన్ సాబ్,గూడు బాషా,రెహమాన్, అబ్దుల్,తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రచురణ

**ఉయ్యాలవాడ, ఆగస్టు 26:( టుడే పల్లె సాక్షి)** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కులాల వారి ఓట్ల జాబితాను గ్రామ సచివాలయాలు, పోలింగ్ కేంద్రాలు,



మండల పరిషత్ కార్యాలయం నందు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీవో నాగలక్ష్మమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని 20 గ్రామపంచాయతీల్లో మొత్తం ఓటర్లు 23,112 మంది ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితా ముసాయిదాను పూర్తి చేయడం జరిగిందన్నారు. మండలంలో ఎస్సీ ఓటర్లు పురుషులు 2,521 మహిళలు 2,607, ఎస్టీలు పురుషులు 1, మహిళలు 2, బీసీ ఓటర్లు పురుషులు 4,468, మహిళలు 4,553 మంది ఓటర్లు ఉన్నారు. ఇతరులు (ఓసి) పురుషులు 3,738, మహిళలు 3,979 మంది కాగా అల్లూరు గ్రామపంచాయతీలో ఒక ట్రాన్స్ జెండర్ ఉన్నారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 28వ తేదీలోగా పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని ఎంపీడీవో సూచించారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**ఎమ్మిగనూరు ఆగస్టు 26 పల్లె సాక్షి** : పట్టణంలో బుధవారం పట్టణ ముస్లిం సోదరులు ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించుకున్నారు. స్థానిక జామియా మసీద్ లో



ఫజర్ మాస్ తర్వాత మీలాద్ ఖుదుబా నిర్వహించారు. అలాగే పట్టణంలోని వివిధ మసీదులలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తదంతరం జోహార్ నమాజు తర్వాత జమ్యా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మీలాదున్ నబి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో పట్టణంలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఒకటి కొకరు మీలాదిన్నబి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ర్యాలీ అనంతరం బందోబస్తు నిర్వహించినందుకు పట్టణ పోలీస్ అధికారులకు కృతజ్ఞతతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్యా మజీద్ అధ్యక్ష కార్యదర్శులు కమిటీ సభ్యులు కొండమీద సాబీర్ అలీ రఫీ అహ్మద్ లేఖత్ అలీ హుస్సేన్ సాబ్ అల్లావుద్దీన్ షేక్ మొహసిన్ లాల్ బాషా డీకే రంజాన్ అబ్దుల్లా బందే నవాజ్ సలీం ఫకీర్ సాబ్ నాగూర్ భాష తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మండలంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

## భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక ప్రార్థనలు

**పెద్దకడబూరు ఆగస్టు 26 :(పల్లెసాక్షి )** పెద్దకడబూరు మండల పరిధిలోని పవిత్ర మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని



పురస్కరించుకుని దొడ్డిమేకల, గంగులపాడు కల్లుకుంట, మేకడోణ, బసలదొడ్డి, చిన్నతుంబళం,హెచ్ మురవణి, పెద్ద కడబూరు, జలవాడి తదితరులు గ్రామాలలో ముస్లిం సోదరులు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వ హించారు. పెద్దకడబూరులో జామియా మసీదు వస్తాదు ఫరీద్ సాబ్,మదీనా మసీదు వస్తాదు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో ముస్లీం సోదరులు ఆయా మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకుంటూ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, దువాలు నిర్వహించారు. ఈ



సందర్భంగా మత పెద్దలు ప్రవక్త మహమ్మద్ బోధనలు ,సమాజంలో శాంతి,ప్రేమ, కరుణ, సోదరభావం, మానవతా విలువలను వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో,ఐకమత్యంతో జీవించాలని పిలుపునిచ్చారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించి,ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలు భక్తి, సోదరభావం,సామాజిక



ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. అనంతరం మక్కా మదీనా నమూనాతో గ్రామ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త గుణాలను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని ముస్లిం సోదరులుకు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ముస్లిం సోదరులు బడే సాబ్,అజిజ్,ఉసెని తాత,ఉసెని సాబ్,బాషా,వివిధ గ్రామాల ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే..

# టీడీపీతోనే సాధ్యం

**టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున**

**పెద్దకడబూరు ఆగష్టు 26( పల్లెసాక్షి ):** కోటిమ ప్రభుత్వం రెండేళ్ల ప్రభుత్వ కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,విద్యాశాఖ మంత్రి, నారా లోకేష్ మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ యన్.రాఘవేంద్ర రెడ్డి,మండల టీడీపీ సీనియర్ నాయకులు గవిగట్టు ఈరన్న ఆదేశాల మేరకు పెద్దకడు బూరు మండలం హులికన్వి గ్రామంలో "ఇంటిం టికి తెలుగుదేశం ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగింది. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గవిగట్టు మల్లికార్జునలి గ్రామ నాయకులు సత్య, ఓబులేసు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం



అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన విద్యార్థుల తల్లులకు అందుతున్న ఆర్థిక సహాయం, అలాగే అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని,వాటిని సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్చార్జి నాగరాజు, నారాయణ,వీరేష్, గోవిందు,చిన్న తిమ్మయ్య, మాస్కి ఓబులేసు తదితర గ్రామ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యం,సోదరభావం

# ప్రతి ఒక్కరి బాధ్యత

**టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డీ**

**ముస్లిం సోదరులందరు ఐక్యమత్యం కలిగి ఉండాలి**

**పెద్దకడబూరు ఆగష్టు 26 (పల్లెసాక్షి):** మండల కేంద్రమైన పెద్దకడబూరులోని షాదీఖానాలో ముస్లిం మత గురువుల ఆధ్వర్యంలో,నిర్వహించిన మిలాద్–ఉన్–నబీ పర్వదిన వేడుకల్లో టిడిపి రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమా కాంత్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, మహ్మద్ ప్రవక్త



బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, సహనం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు. భారతదేశం లౌకిక దేశమని, కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా అన్ని మతాలను గౌరవిస్తూ మత సామరస్యాన్ని, ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లిం సోదరులకు మిలాద్–ఉన్–నబీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రమాకాంత్ రెడ్డిని మతగురువుల సమక్షంలో ముస్లిం సోదరులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తలారి మీసేవ ఆంజనేయులు,డి. మల్లికార్జున,మండల ప్రధాన కార్యదర్శి మొట్రు, రామాంజనేయులు, కోస్గి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న కార్తికేయ,డీలర్ గుమ్మల ఆశన్న,పెద్ద హనుమంతు,కుంటీఈరన్న అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ దేవాలయం...

# నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం వేడుకలు

**ప్రత్యేకంగా హోమం ద్వారా ధ్వజస్తంభంకు పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు**

**ఉదయం వేద మంత్రోక్షణ ద్వారా ప్రత్యేక హోమం - ప్రధాన ఆలయ అర్చకులు**

**ప్రత్యేక పూజలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి**

**పెద్దకడబూరు,ఆగష్టు 26( పల్లెసాక్షి ):** మండలంలోని చిన్నకడబూరు గ్రామంలో శివాలయ దేవాలయంకు నూతన





ధ్వజస్థంభ ప్రతిష్ట మహోత్సవం బుధవారం శుభ ముహూర్తమున పండితులు వేద మంత్రాలు పఠిస్తుండంగా ఆలయ,గ్రామ పెద్దల సమక్షంలో అశేష భక్తవాహిణి నడుమ కన్నుల పండుగగా జరిగింది. ఇందులో ప్రత్యేకంగా హోమం ద్వారా ధ్వజస్తంభంకు పూజలు నిర్వహించడంతోపాటు ఉదయం 10:00కు వేద మంత్రోక్షణ ద్వారా భ్రమరాంబిక,గణపతి, కుమారస్వామి,విగ్రహాలకు ప్రత్యేక పూజలతో శివలయ దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ పూజారులు బసవరాజు స్వామి, మారుతి స్వామి ఆలయ ధర్మకర్త గౌళ్ళ నల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. అలాగే ఆలయ కమిటీ పెద్దలు తాయన్న, నారాయణస్వామి ముత్తన్న,కోడిగుడ్ల లక్ష్మన్న, వీరారెడ్డి, ఎల్లన్న గిడ్డయ్య,సమక్షంలో నూతనంగా



ఏర్పాటుచేసిన శివలయ దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగిందని గ్రామ పెద్దలు తెలియజేశారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహో త్సవం భాగంగా బుధవారం చిన్నారులు కలసాలు చేత బూని విశేషంగా ఆ కొట్టుకున్నారు. ఆ చిన్నారులను తల్లిదండ్రులు స్వామివారి ధ్వజస్తంభ ప్రతిష్టకు అతి సుందరంగా సిద్ధం చేసి కలసాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా శివలయ దేవాలయం చేరుకున్నారు. అనంతరం వేద పండితులు ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవముకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం కాల్చిన అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు గ్రామ ఆడపడుచులు గావించుకున్నారు. శివలయ దేవాలయం,నూతన ధ్వజ స్తంభ ప్రతిష్టాపనకు వచ్చిన భక్తాదులకు,వివిధ గ్రామాలను నుండి వచ్చిన భక్తులకు కమిటీ బృందం,ప్రత్యేక పూజలు నిర్వహించాలని వారు తెలియజేశారు.

**నూతన ధ్వజస్తంభ ప్రతిష్టపాన మహోత్సవంలో టిడిపి రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు..** శివాలయ దేవాలయం నూతన ధ్వజస్తంభం ప్రతి



ష్టాపన మహోత్సవంలో టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి పాల్గొని ముందుగా శ్రీశ్రీ ఆంజనేయ స్వామికి సొసైటీ చైర్మన్ తలారి మీసేవ ఆంజనేయులు, డి.మల్లికార్జున సొసైటీ డైరెక్టర్ ఎం.జి నరసన్న, కోసిగి మార్కెట్ డైరెక్టర్ కలగట్ల లక్ష్మన్న, బుసిరెడ్డి, జనసేన మహాదేవ, రామలింగారెడ్డి,హనుమంత్ రెడ్డి,ప్రత్యేక పూజలు నిర్వహించుకొని నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ కార్య క్రమంలో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలును నిర్వహించుకొని వేద పండితులు ఆలయ అర్చకులుచే ప్రత్యేక మొక్కలు తీర్చుకున్నారు. అలాగే నూతన గృహ హనుమంత్ రెడ్డి గృహప్రవేశాన్ని రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం ప్రారంభించా రు. గృహప్రవేశం లోని టిడిపి ముఖ్య నేతలకు శాలువ పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో వైసీపీ నాయకులు నాగరాజు, వెంకటేష్,జనసేన నాయకులు మహాదేవ, జాము అంజి,జాము కామయ్య, లక్ష్మన్న,గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED&PUBLISHED AND OWNED BY EDITOR:V.LINGAMURTHY. PUBLISHED AT DOOR NO:4/83,BC COLONY, KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, PINCODE:518360.MURTHY OFFSET PRINTERS D.NO:4/83,KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, CONTACT NO:9000367833.RNI,APTEL/2022/82037 E-MAIL ID:pallesakshi2022@gmail.com